

నిర్మల్ పట్టణంలోని కాలనీల్లో నిలిచిన నీటిని పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్మన్ ఈశ్వర్


నమస్తే తెలంగాణ

# ఆదిలాబాద్-నిర్మల్

5 | నిజామాబాద్ సోమవారం 22 జూలై 2024 | ADILABAD NIRMAL




కనకాయ జలపాతం వద్ద ప్రమాదకరంగా చేపలు పడుతున్న జాలరులు



## స్వర్ణ ప్రాజెక్టుకు స్వల్పంగా వరద

మత్తడిలో నుంచి ప్రవహిస్తున్న లింగాపూర్ చెరువు నీరు

సారంగాపూర్, జూలై 21 : మూడు రోజుల నుంచి కురుస్తున్న వర్షాలతో స్వర్ణ ప్రాజెక్టుకు ఆదివారం స్వల్పంగా వరద నీరు వచ్చి చేరుతున్నది. ప్రాజెక్టు నీటిమట్టం 1183 అడుగులు కాగా.. 1176 అడుగుల వరకు నీరు చేరిందని అధికారులు తెలిపారు. ప్రాజెక్టు సామర్థ్యం 1.484 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం 0.906 టీఎంసీల నీరు చేరింది. ఇన్ ఫ్లో 2 వేల కూసెక్కుల నీరు కాగా అవుట్ ఫ్లో నీరు వెళ్లడం లేదు. లింగాపూర్ చెరువు పూర్తిగా నిండిపోయింది. చెరువు మత్తడి నుంచి నీరు పెద్ద ఎత్తున ప్రవహిస్తుండడంతో పెండల్‌ధరి, ఇప్పచెలిమి గ్రామాలకు రాకపోకలు బంద్ అయ్యాయి.



కడెం ప్రాజెక్టు గేట్ల ద్వారా దిగువకు వెళ్తున్న నీరు

## కడెం వరద గేట్ల ద్వారా నీటి విడుదల

కడెం, జూలై 21 : మూడు రోజులుగా కురుస్తున్న వర్షాల వల్ల కడెం ప్రాజెక్టులోకి ఇన్‌ఫ్లో కొనసాగుతున్నది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 700 అడుగులు (7.603టీఎంసీలు) కాగా, ప్రస్తుతం 690.875 అడుగులు (5.444టీఎంసీల) వద్ద ఉంది. 13,283 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో రాగా, 14,359 క్యూసెక్కుల ఔట్ ఫ్లో ఉంది. దీంతోపాటు, కుడి కాలువకు 8 క్యూసెక్కులు, ప్రధాన కాలువకు 298 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. గతంలో 698 అడుగుల నీటిమట్టం వద్ద నిల్వ ఉంచుతూ అధికారులు ఎగువ నుంచి వచ్చిన ఇన్‌ఫ్లోను దిగువకు విడుదల చేసేవారు. అయితే పనులు పూర్తి అయినప్పటికీ 690 అడుగుల వద్ద నీటిని ఉంచి, వచ్చిన స్వల్ప ఇన్‌ఫ్లోను దిగువకు విడుదల చేయడంపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్న పరిస్థితి కనబడుతున్నది. కలెక్టర్ ఆదేశాల మేరకు ఆయకట్టు వద్ద సీఈ, డీఈసీ, ఈఈ, డీఈ, ఏఈలు అందుబాటులోనే ఉంటున్న క్రమంలో కేవలం 15 వేల ఇన్‌ఫ్లో రావడంతోనే నీటిని నాలుగు గేట్ల ద్వారా విడుదల చేయడం అధికారుల నిర్లక్ష్యంగా కనబడుతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రాజెక్టులో కనీసం 696 అడుగుల వద్ద నీటిని నిల్వ ఉంచుతూ వచ్చే ఇన్‌ఫ్లో అదే స్థాయిలో విడుదల చేస్తే సరిపోతుందని, 18 గేట్లు మరమ్మతులు పూర్తి చేసి ఉంచిన పరిస్థితిలో కేవలం 690 వరకు మాత్రమే నీటిని నిల్వ ఉంచడం ఎంటని ఆవేదన చెందుతున్నారు. ప్రస్తుతం వర్షాలు సంవృద్ధిగా ఉన్నప్పటికీ భవిష్యతులో ఇబ్బందులు తతెత్తితే పరిస్థితి ఎంటని, కావున అధికారులు 696 అడుగుల వద్దనైన నీటిని నిల్వ ఉంచేలా చూడాలని రైతులు కోరుతున్నారు. ప్రస్తుతం 13283 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో రావడంతో అధికారులు అంతకు మించి 14359 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

## కనువిందుగా కనకాయ

బజార్‌హత్నూర్, జూలై 21 : కనకాయ జలపాతం కనువిందు చేస్తున్నది. ఈ జలపాతం బజార్‌హత్నూర్ మండలంలోని గిర్నూర్ గ్రామపంచాయతీ పరిధిలోని బలన్‌పూర్ గ్రామ సమీపంలోని అటవీ ప్రాంతంలో ఉంది. ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడ నుంచి బజార్‌హత్నూర్ మండలానికి ఆర్‌అండ్‌బీ రహదారి గుండా బలన్‌పూర్ గ్రామ సమీపంలోని కనకదుర్గ దాబా వద్ద నుంచి మూడు కిలోమీటర్లు కాలినడకన చేరుకోవచ్చు. కాగా.. జలపాతానికి కనీస రోడ్డు వసతిలేక పర్యాటకులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. బురద రోడ్డుపై నుంచే జలపాతాన్ని సందర్శిస్తున్నారు. ప్రభుత్వం చొరవ తీసుకుని పర్యటక కేంద్రంగా గుర్తించాలని పర్యటకులు కోరుతున్నారు.

### ప్రమాదపు అంచున చేపల వేట

జలపాతం వద్ద ప్రమాదపు అంచున చేపల వేటను కొనసాగిస్తున్నారు. ఒక పక్క జిల్లా పోలీస్ యంత్రాంగం భారీ వర్షాల నేపథ్యంలో చెరువులు, వాగులు, వంకలు, ప్రాజెక్టుల వద్ద ఉండొద్దని సూచిస్తున్నది. అయినప్పటికీ చేపల వేట కొనసాగిస్తున్నారు. జలపాతం వద్ద పోలీసు బందోబస్తు నిర్వహించాలని ప్రజలు కోరుతున్నారు.

# గెరువియ్యలే..

## మూడు రోజులుగా ఏకధాటిగా కురుస్తున్న వర్షం

- ప్రాజెక్టుల్లోకి చేరుతున్న వరద నీరు.. గేట్లు ఎత్తి నీటి విడుదల
- ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్న అధికారులు
- 8712659555, 7036661070 కంట్రోల్ నంబర్ల ఏర్పాటు

నిర్మల్ అర్బన్, జూలై 21 : నిర్మల్ జిల్లాలో మూడు రోజులుగా వర్షం ఏకధాటిగా కురుస్తున్నది. పట్టణంలోని శివారు కాలనీలైన విశ్వనాథ్‌పేట్, సోఫినగర్ కాలనీలతోపాటు ప్రియదర్శిని నగర్ కాలనీల్లోని లోతట్టు ప్రాంతాల్లో వర్షం నీరు నిలిచింది. 24-48 గంటల్లో భారీ వర్షాలు కురవనున్న నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని నాయకులు, అధికారులు ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు. గడ్డెన్న, స్వర్ణ, కడెం జలాశయాలకు వరద నీరు పోటెత్తుతున్నది. కడెంకు భారీగా వరద నీరు వచ్చి చేరుతుండడంతో మూడు గేట్లను ఎత్తి దిగువ ప్రాంతానికి నీటిని వదులుతున్నారు.

### అత్యవసరం అయితే తప్పా బయటకు రావద్దు..

భారీ వర్షాల దృష్ట్యా ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని పోలీసులు ఆదేశాలు జారీ చేశారు. పోలీసు యంత్రాంగాన్ని ఎస్పీ జానకి షర్మిల అప్రమత్తం చేశామన్నారు. విపత్కర సమయంలో సహాయం కోసం పోలీసులు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. లోతట్టు ప్రాంతాల్లో చిక్కుకున్నట్లయితే డయల్ 100, స్థానిక పోలీసులకు ఫోన్ చేసినట్లయితే తక్షణ సహాయం అందుతుందని పేర్కొన్నారు. ప్రాజెక్టు పరీవాహక గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని.. వాగులు, వంకలు పొంగిపొర్లే అవకాశం ఉన్న నేపథ్యంలో ప్రజలు భద్రతా ప్రమాణాలను దృష్టి ఉంచుకుని వాటి వద్దకు వెళ్లవద్దని సూచించారు. మత్స్యకారులు చేపల వేటకు వెళ్లవద్దని, రైతులు పొలాల్లో విద్యుత్ మోటార్ల వద్ద జాగ్రత్తగా ఉండాలని సూచిస్తున్నారు.

### 76.2 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదు

నిర్మల్ జిల్లాలో గడిచిన 24 గంటల్లో జిల్లా వ్యాప్తంగా సగటున 76.2 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైనట్లు వాతావరణ శాఖ అధికారులు వెల్లడించారు. అత్యధికంగా సారంగాపూర్ మండలంలో 124.5 మిల్లీ మీటర్లు, నర్సాపూర్(జి)లో 31.6 మి.మీ. అత్యల్పంగా నమోదైంది. కుభీర్ 53.6, బాసర 47.4, ముథోల్ 43.5, భైంసా 42.4, కుంటాల 59.4, తానూర్‌లో 33.2, లోకేశ్వరంలో 69.4, దిలావర్‌పూర్‌లో 72.6, నిర్మల్‌లో 96.4, నిర్మల్ రూరల్‌లో 88.2, సోన్‌లో 82.6, లక్ష్మణచాందలో 123.6, మామడలో 102.8, పెంబిలో 64.6, ఖానాపూర్‌లో 123.2, కడెంలో 103.4, దస్తురాబాద్‌లో 84.4 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది.

### నిండుకుండలను తలపిస్తున్న ప్రాజెక్టులు

ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షాలతో ప్రాజెక్టుల్లోకి భారీగా వరద నీరు వచ్చి చేరుతున్నది. గడ్డెన్న వాగు నీటి సామర్థ్యం 358.70 మీటర్లు ఉండగా ప్రాజెక్టులో ప్రస్తుత నీటి మట్టం 355.90 మీటర్లకు చేరిందని సగటున 24 గంటల్లో 335 క్యూసెక్కుల వరద నీరు చేరుతుందని అధికారులు తెలిపారు. స్వర్ణ ప్రాజెక్టు 1183 ఫీట్లు (360.56 మీటర్లు) ఉండగా ప్రస్తుత నీటి లెవల్ 1176.3 ఫీట్లు ఉన్నాయి. 3,890 క్యూసెక్కుల వరద నీరు ప్రాజెక్టులోకి చేరుతుందని అధికారులు తెలిపారు. కడెం ప్రాజెక్టు లెవల్ 690.900 కాగా ప్రాజెక్టుల్లోకి 15,778 క్యూసెక్కుల వరద నీరు ప్రాజెక్టులోకి రాగా.. ప్రాజెక్టు మూడు గేట్లు తెరిచి 14,460 క్యూసెక్కుల నీటిని దిగువ ప్రాంతాలకు వదులుతున్నారు.

### కంట్రోల్ రూంలు ఏర్పాటు..

విపత్కర పరిస్థితుల్లో 8712659555 నంబర్‌కికి ఫోన్ చేసినట్లయితే పోలీసులు తక్షణ సహాయ చర్యలు చేపట్టనున్నారు. అలాగే నిర్మల్ పట్టణంలోని 42 వార్డుల ప్రజల సౌకర్యార్థం వరద నీరు ఇండ్లలోకి వచ్చిన ఇతర ఎలాంటి సమస్యలు తలెత్తినా మున్సిపల్ కార్యాలయంలో 7036661070 కంట్రోల్ నంబర్‌ను ఏర్పాటు చేశారు.

## కుంటాలకు పోటెత్తిన వరద

*ప్రముఖ పర్యాటక ప్రాంతంగా పేరున్న కుంటాల జలపాతం వరదనీటితో పోటెత్తింది. ఎగువ ప్రాంతంలో కురుస్తున్న భారీ వర్షాలతో జలపాతంలోకి వరదనీరు వచ్చి చేరుతున్నది. భారీ వర్షాలతో జలపాతం వద్ద వరదనీరు ఉప్పొంగి ప్రవహిస్తున్నది. సందర్శనను నిలిపివేస్తున్నట్లు అటవీశాఖ అధికారులు తెలిపారు.*

*- నేరడిగొండ, జూలై 21*



కుంటాల జలపాతం



పరవళ్లు తొక్కుతున్న కనకాయ జలపాతం

## బండల తొలగింపు

### త్రివేణి సంఘం ప్రాజెక్టుకు సంతరించుకున్న జలకళ

ఇంద్రవెల్లి, జూలై 21 : ముత్నూర్, శంకర్‌గూడ గ్రామాల మధ్య గల త్రివేణి సంఘం ప్రాజెక్టులోకి భారీగా వరద నీరు చేరడంతో మత్తడి నీళ్లు సక్రమంగా వెళ్లేందు అధికారులు జేసీబీ సహాయంతో మట్టితోపాటు బండలను తొలగించారు. ఆదివారం త్రివేణి సంఘం ప్రాజెక్టుతోపాటు వరదనీరు పారే మత్తడిని నీటిపారుదల శాఖ డీఈ రాథోడ్ వినోద్, ఏఈఈ ప్రవీణ్‌కమార్‌లు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మత్తడిపై నుంచే పారే నీటి ప్రవాహం తాకిడితో ప్రధాన రోడ్డుకు నష్టం వాటిల్లకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నామన్నారు. సైడ్‌కు మట్టితో నింపిన సంచులు వేసి నీరు పోకుండా అడ్డు కట్టను ఏర్పాటు చేస్తున్నామన్నారు. జేసీబీతో మట్టితోపాటు బండలను తొలగించి వరదనీరు నిటారుగా వెళ్లే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు.



మత్తడి దుంకుతున్న త్రివేణి సంఘం ప్రాజెక్టు

## భర్తే దొంగ

- సొంటింట్లోనే చోరీ
- భార్య ఫిర్యాదుతో నేరం అంగీకారం
- రూ.3.20 లక్షల సొత్తు స్వాధీనం


నిర్మల్ అర్బన్, జూలై 21 : జల్సాలకు అలవాటు పడి, సొంత ఇంట్లోనే దొంగతనానికి పాల్పడ్డ భర్త అడ్డంగా దొరికిన ఘటన నిర్మల్ పట్టణంలో చోటు చేసుకున్నది. విలేకరుల సమావేశంలో సీఐ ప్రవీణ్ కుమార్ వివరాలను వెల్లడించారు. నిర్మల్ పట్టణంలోని మహదేవ్‌పూర్ కాలనీకి చెందిన అనిత రాణి సోఫినగర్ కాలనీలోని ప్రభుత్వ పాఠశాలలో ఉద్యోగిగా విధులు నిర్వహిస్తున్నది. ఎప్పటిలాగే ఈనెల 19వ తేదీన అనిత రాణి తన భర్త శివ ద్విచక్రవాహనంపై వెళ్లి పాఠశాల నుంచి సాయంత్రం ఇంటికి తిరిగి వచ్చింది. ఇంటి తలుపు తెరిచి ఉండడం, బీరువాలోని వస్తువులు చిందర వందరగా ఉండడం చూసి బీరువాను పరిశీలించింది. బీరువాలో ఉన్న ఎనిమిది తులాల బంగారం, ఆరు తులాల వెండిని గుర్తు తెలియని వ్యక్తులు దొంగిలించారని గ్రహించిన ఆమె పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తులో భాగంగా ఇంటి చుట్టూ పక్కల గల సీసీ కెమెరాలను పరిశీలించారు. ఇంట్లో ఎవరూ చొరబడకపోవడంతో అనుమానం వచ్చిన పోలీసులు ఆమె భర్త శివను విచారించడంతో నేరం చేసినట్లు ఒప్పుకున్నాడు. ఇతని వద్ద నుంచి రూ.3.20 లక్షల విలువ చేసే 8.1 తులాల బంగారం ఆరు తులాల వెండిని స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించారు.



వివరాలను వెల్లడిస్తున్న పోలీసులు

## రామన్న స్ఫూర్తివంతమైన నాయకుడు

ఎదులాపురం, జూలై 21 : రానున్న తరానికి స్ఫూర్తివంతమైన నాయకుడు జోగు రామన్న అని బీఆర్‌ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు విజ్జగిరి నారాయణ అన్నారు. గురుపౌర్ణమి సందర్భంగా ఆదివారం పార్టీ సీనియర్ కార్యకర్త విజ్జగిరి నారాయణ విధేయతను చాటుకున్నారు. పిట్టలవాడలోని తన నివాసానికి తన రాజకీయ గురువు మాజీ మంత్రి, బీఆర్‌ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు జోగు రామన్నను ఆహ్వానించి సత్కరించారు. అనంతరం విందు ఏర్పాటు చేయగా కార్యకర్తలతో కలిసి అక్కడే భోజనం చేశారు. రామన్న వంటి స్ఫూర్తివంతమైన నాయకుడు దొరకడం నేటి తరం అదృష్టమని కొనియాడారు. రామన్నను ప్రథమ గురువుగా గుర్తుంచుకోవడం జరుగుతుందని సంతోషం వ్యక్తం చేశారు. అనంతరం రామన్నతో కలిసి ఫొటోలు దిగుతు వారి సంతోషాన్ని పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో మెట్టు ప్రహ్లాద్, సాజీదొద్దీన్, కౌన్సిలర్ భరత్, సేవ్వా జగదీశ్, కొమ్ర రాజు, నవత శ్రీనివాస్, హోగేశ్, సంజయ్ పాల్గొన్నారు.




సీనియర్ కార్యకర్త విజ్జగిరి నారాయణ నివాసంలో కార్యకర్తలతో మాట్లాడుతున్న మాజీ మంత్రి జోగు రామన్న

## వైభవంగా గురు పౌర్ణమి

- బాసరకు తరలివచ్చిన భక్తజనం
- తమ చిన్నారులకు అక్షరాభ్యాసాలు
- అమ్మవారిని దర్శించుకున్న స్థానిక ఎమ్మెల్యే రామారావు పటేల్

బాసర, జూలై 22 : బాసర సరస్వతీ ఆలయంలో ఆదివారం గు రుపౌర్ణమి వేడుకలను వైభవంగా నిర్వహించారు. వైదిక బృందం ఆధ్వర్యంలో శాంతిపాఠము, మంటపారాదన చేశారు. వేదవ్యాస మహర్షికి విశేష ద్రవ్యములతో ప్రత్యేక మహాభిషేకం, అలంకరణ, రుద్ర స్వహాకారులు పూజలను అంగరంగ వైభవంగా నిర్వహించారు. గురుపౌర్ణమిని పురస్కరించుకుని వేదవ్యాస మహర్షి స్వామి దర్శనం కోసం భక్తులు బారులుదీరారు. అమ్మవారి దర్శనానికి కూడా గంటల తరబడి క్యూలైన్‌లో వేచి చూశారు. ఈ సందర్భంగా తమ చిన్నారులకు అక్షరశ్రీకార నిర్వహించారు. ఉత్సవాల చివరి రోజులో భాగంగా అమ్మవారిని ముథోల్ నియోజకవర్గ ఎమ్మెల్యే రామారావు పటేల్ దర్శించుకున్నారు.



పూజలు చేస్తున్న వేద పండితులు

## కడెం కాలువల ద్వారా నీటి విడుదల

కడెం, జూలై 21 : వానకాలం పంటల కోసం కడెం ఆయకట్టు పరిధిలోని రైతులకు సాగు నీటిని విడుదల చేశామని ఎమ్మెల్యే బొజ్జు పటేల్ అన్నారు. ఆదివారం కడెం కుడి, ప్రధాన కాలువల ద్వారా సాగు నీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రభుత్వం రూ.9.42 కోట్లను కేటాయించి ప్రాజెక్టు పనులు చేపట్టినట్లు వెల్లడించారు. కుడి కాలువ ద్వారా నాలుగు గ్రామాలకు, ప్రధాన కాలువ ద్వారా 65 డిస్ట్రిబ్యూటరీ వరకు నీటిని అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఖానాపూర్ మున్సిపల్ చైర్మన్ సత్యం, యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పొద్దుటూరి సతీశ్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు తుమ్మల మల్లేశ్‌యాదవ్, మహిళ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు భవానీ, కడెం, దస్తురాబాద్ మాజీ ఎంపీపీలు అలెగ్జాండర్, సింగరి కిషన్, మంచిర్యాల నియోజకవర్గ నాయకులు గడ్డం త్రిమూర్తి, దాసరి ప్రేందీప్, స్థానిక నాయకులు రమేశ్‌రావు, రాజశేఖర్, సయ్యద్ ఇసాక్, లక్ష్మన్, వాజీద్‌ఖాన్, బబ్లు, గోళ్ల వెంకటేశ్, రఫీక్, రమేశ్, బొడ్డు గంగన్న, ఆకుల లచ్చన్న, కట్ల సాగర్, షబ్బీర్‌పాషా, శ్రీనివాస్ పాల్గొన్నారు.



ప్రధాన కాలువ ద్వారా నీటిని విడుదల చేస్తున్న ఎమ్మెల్యే

## లోయలో పడ్డ కారు

- ముగ్గురికి స్వల్ప గాయాలు
- బాధితులను కాపాడిన పోలీసులు

సారంగాపూర్, జూలై 21 : మహబూబ్‌ఘాట్ లోయలో ఆదివారం వేకువజామున సుమారు 2 గంటల ప్రాంతంలో కారు బోల్తా పడడంతో ముగ్గురికి స్వల్ప గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. టీఎస్ 07 హెచ్‌జీ 6899 అనే నంబర్ గల కారులో హైదరాబాద్‌లోని సరూర్‌నగర్‌కు చెందిన వెంకట రాధాకృష్ణ, అతని భార్య దుర్గాకల్యాణి, కొడుకు ప్రేమ్ కలిసి ఆదివారం సెలవు కావడంతో నాగాపూర్‌లో ఉంటున్న తన స్నేహితుడి ఇంటికి వెళ్తున్నారు. అయితే మహబూబ్‌ఘాట్ మూడో సెక్షన్‌లో పొగమంచు అధికంగా ఉండడంతో రోడ్డు కనిపించక అదుపుతప్పి కారు లోయలో పడింది. దీంతో బాధితులు నిర్మల్ కంట్రోల్ రూమ్‌కి ఫోన్ ద్వారా సమాచారం అందించారు. వెంటనే అప్రమత్తమైన నిర్మల్ డీసీఆర్‌బీ ఇన్‌స్పెక్టర్ గోపీనాథ్, సారంగాపూర్ ఎస్‌ఐ శ్రీకాంత్, పోలీస్ సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని తాడు సహాయంతో లోయ నుంచి కారులో ఉన్న రాధాకృష్ణ, అతని భార్య దుర్గాకల్యాణి, కొడుకు ప్రేమ్‌ను తాడుతో పైకిలాగి కాపాడారు. ముగ్గురు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. వీరిని చికిత్స కోసం నిర్మల్ ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఎస్‌ఐలు గోపీనాథ్, శ్రీకాంత్‌లను ఎస్పీ జానకీ షర్మిల అభినందించారు.



లోయలో పడ్డ బాధితులను పైకి లాగుతున్న పోలీసులు